# యువతే దేశానికి భవిత

# డా జీవీ

యువతే దేశానికి భవిష్యత్తు అని, విద్యార్థులు చిన్న వయసు నుంచే మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని శ్రీరక్ష హాస్పిటల్ అధినేత డాక్టర్ జీవీ అన్నారు. ఖమ్మం జిల్లా కైకొండాయిగూడెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం 'నషా ముక్త్ భారత్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, వాటి ప్రభావం వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజం, దేశంపై ఎలా ఉంటుందనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జీవీ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందన్నారు. విద్యార్థి దశలోనే మంచి అలవాట్లను అలవర్చుకుంటే భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడటమే కాకుండా చదువు, కుటుంబ సంబంధాలు, సామాజిక జీవితం కూడా దెబ్బతింటాయని వివరించారు. ప్రస్తుత సమాజంలో మత్తు పదార్థాల వినియోగం యువతను తీవ్రంగా ప్రభావితం చేసే అంశంగా మారిందని, దీనిపై విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమిష్టిగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మత్తు పదార్థాలకు ఒకసారి బానిసైతే దాని నుంచి బయటపడటం ఎంతో కష్టమవుతుందని, అందువల్ల వాటికి దూరంగా ఉండటమే అత్యంత సురక్షితమైన మార్గమని సూచించారు.

## విద్యార్థులే మార్పుకు మార్గదర్శకులు

విద్యార్థులు తమ స్నేహితులు, చుట్టుపక్కల యువతలో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని డాక్టర్ జీవీ సూచించారు. ఎవరైనా మత్తు పదార్థాల బారిన పడినట్లు గుర్తిస్తే వారిని నిరుత్సాహపరచకుండా, అవసరమైన సహాయం మరియు సరైన మార్గదర్శకత్వం అందించేలా పెద్దలకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. 'నషా ముక్త్ భారత్' వంటి అవగాహన కార్యక్రమాల ప్రధాన ఉద్దేశ్యం మత్తు పదార్థాల వినియోగాన్ని నిరోధించడంతో పాటు యువతలో ఆరోగ్యం, క్రమశిక్షణ, బాధ్యతాయుత ప్రవర్తనపై చైతన్యం తీసుకురావడమేనని పేర్కొన్నారు.

## ఆరోగ్యమే నిజమైన సంపద

విద్యార్థులు ప్రతిరోజూ శారీరక వ్యాయామం, క్రీడలు, పుస్తక పఠనం వంటి ఆరోగ్యకరమైన కార్యక్రమాలకు సమయం కేటాయించాలని సూచించారు. ఒత్తిడి, ఆందోళన లేదా ఇతర సమస్యలు ఎదురైనప్పుడు మత్తు పదార్థాలను ఆశ్రయించకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా నమ్మకమైన పెద్దలతో మాట్లాడాలని చెప్పారు. యువత ఆరోగ్యంగా ఉంటేనే దేశం బలంగా అభివృద్ధి చెందుతుందని, ప్రతి విద్యార్థి తన ఆరోగ్యం పట్ల బాధ్యత వహించాల్సిన అవసరం ఉందన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండటమే కాకుండా ఇతరులను కూడా వాటి నుంచి దూరంగా ఉంచేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## పాఠశాల స్థాయి నుంచే అవగాహన అవసరం

మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు పాఠశాల స్థాయి నుంచే నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అవసరమని కార్యక్రమంలో పాల్గొన్న వారు అభిప్రాయ పడ్డారు. విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే తక్షణ, దీర్ఘకాలిక దుష్ప్రభావాలను వివరించడంతో పాటు, వాటికి ఆకర్షితులయ్యే పరిస్థితులను గుర్తించి ముందుగానే నివారించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహించారు. మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, యువతను సన్మార్గంలో నడిపించేందుకు కుటుంబం, విద్యాసంస్థలు, వైద్యులు, సమాజం కలిసి పనిచేయాలని కార్యక్రమంలో పిలుపునిచ్చారు.



## పేరెంట్స్ మీటింగ్ అనంతరం మొక్కలు నాటిన సిబ్బంది

పేరెంట్ మీటింగ్ మరియు నో బ్యాగ్ డే సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కైకొండాయిగుడెంలో ఉదయం 10 గంటలనుండి పేరెంట్స్ మీటింగ్ నిర్వహించి పలువురు పేరెంట్స్ తో సమావేశమై వారి పిల్లల ప్రగతిపై వివరించనైనది. ఈ కార్యక్రమంలో భాగంగా హాజరైన విద్యార్థుల తల్లుల సమక్షంలో ఏక్ పెడ్ మాకె నామ్ 3.0 కి సంబంధించి విద్యార్థులతో మొక్కలు నాటించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కైకొండాయిగూడెం హెచ్ఎం డి.శ్రీదేవి, ఉపాధ్యాయులు సీహెచ్ పద్మావతి, బెన్ని ప్రభుదాస్, ఎండీ ఆదిల్, ఏ.లక్ష్మీరాజ్యం, ఎండీ రిజ్వాన్, బీవీ సుబ్బారావు, బి.వీరయ్య, విశ్రాంత ఉపాధ్యాయురాలు జి.నాగమణి, శ్రీరక్ష హాస్పిటల్ స్టాఫ్, హై స్కూల్ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు. పలువురిని సత్కరించారు.









డా.జీవీని సత్కరిస్తున్న హై స్కూల్ ఉపాధ్యాయులు